జ్వాల తెలుగు న్యూస్

RNI NO: TELTEL/2023/88524

# మెదక్ టుడే

MEDAK TODAY

తెలుగు దిన పత్రిక...

30 మార్చి 2026 | మెదక్ | పేజీలు :4 వెల రూ.:2 | ఎడిటర్: సిహెచ్. శివకుమార్ | సంపుటి 02 | సంచిక 119

**కాంగ్రెస్, కమ్యూనిస్టుల తెరపై శత్రువులు.. తెర వెనుక మిత్రులు!**

**అవినీతిపరుల నుంచి ప్రతి పైసా వసూల్ చేస్తాం**

**ప్రధాని మోదీ గ్యారెంటీ**

2

## కేరళలో 'దోపిడీ కూటమి'కి
# కాలం చెల్లింది..



కేరళ రాష్ట్రం దశాబ్దాలుగా స్వార్థ రాజకీయాల మధ్య నలిగిపోతోందని, కాంగ్రెస్ మరియు కమ్యూనిస్టులు కలిసి ప్రజల సంపదను కొల్లగొట్టారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పాలక్కాడ్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, రాష్ట్రంలో మార్పు స్పష్టంగా కనిపిస్తోందని, ఈసారి ఎన్‌డీఏ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

## తమిళనాడు 'కురుక్షేత్రం'

**దళపతి డబుల్ అటాక్..**

**నేరుగా స్టాలిన్ కోటపైనే గురి!**



2

తమిళనాడు రాజకీయాల్లో 'విజిల్' మోగింది. నటుడు విజయ్ తన రాజకీయ అరంగేట్రంలోనే అత్యంత సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నారు. కేవలం అభ్యర్థులను ప్రకటించడమే కాకుండా, అధికార డీఎంకే అగ్రనేతలను ఢీకొట్టేలా వ్యూహరచన చేశారు.

# కన్నవారికి కవచం

## కంటికి రెప్పలా కాపాడుకునే చట్టం

**జీతంలో కోత..**

**నేరుగా తల్లిదండ్రుల ఖాతాలోకి!**

**ఉద్యోగులకే కాదు.. ప్రజా ప్రతినిధులకు కూడా వర్తింపు!**

**కేంద్ర చట్టం కన్నా మిన్నగా.. తెలంగాణ 'భరోసా'**

**ఆత్మీయతను గుర్తు చేసే సామాజిక బాధ్యత**

**"రెక్కలొచ్చాక మరిచిపోతారా?"**

**సీఎం రేవంత్ రెడ్డి భావోద్వేగ ప్రసంగం**



**హైదరాబాద్ డెస్క్:** రక్త సంబంధాల కంటే ఆర్థిక సంబంధాలే మిన్న అనుకుంటున్న నేటి సమాజానికి తెలంగాణ ప్రభుత్వం ఒక బలమైన 'నైతిక' హెచ్చరిక పంపింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన లి"తల్లిదండ్రుల సంరక్షణ - ఉద్యోగుల బాధ్యత బిల్లు"లికు శాసనసభ పచ్చజెండా ఊపింది. ఇది కేవలం ఒక చట్టం కాదు, కన్నవారి కన్నీళ్లు తుడిచే ఒక సామాజిక అస్త్రం.

**"జీతం మీది.. హక్కు వారిది": కొత్త చట్టం ఏం చెబుతోంది?**

తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ఏ ఉద్యోగి అయినా ఇకపై తప్పించుకోలేరు. వారి వేతనం నుంచి కొంత భాగాన్ని ప్రభుత్వం నేరుగా తల్లిదండ్రుల ఖాతాలోకి మళ్లిస్తుంది. నెలకు వచ్చే వేతనంలో 15 శాతం లేదా గరిష్ఠంగా రూ. 10,000 వరకు (ఏది తక్కువైతే అది) కోత విధించి, నేరుగా బాధితులైన తల్లిదండ్రుల బ్యాంక్ ఖాతాలో జమ చేస్తారు. ఈ చట్టం నుంచి ఎవరికీ మినహాయింపు లేదు. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేట్ కార్పొరేట్ సిబ్బందితో

మిగతా 2లో



## బెంగాల్ కంచంపై
# బీజేపీ కన్నేసింది

**మీ ఆహార స్వేచ్ఛను హరిస్తారా?"**

**"చేపలు, మాంసం మర్చిపోవాల్సిందే":**

**అమిత్ షా 'ఛార్జ్‌షీట్'పై దీదీ కౌంటర్**

**అణచివేత లేని పాలన – టీఎంసీ నినాదం.**

**మమతా బెనర్జీ సంచలన ఆరోపణలు**

**పురూలియా మార్చి 29:** పశ్చిమ బెంగాల్ ఎన్నికల క్షేత్రంలో తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ సరికొత్త అస్త్రాన్ని ప్రయోగించారు. బీజేపీ అధికారంలోకి వస్తే కేవలం రాజకీయ మార్పు మాత్రమే కాదు, బెంగాలీల జీవనశైలి మరియు ఆహారపు అలవాట్లపై కూడా ఆంక్షలు వస్తాయని ఆమె హెచ్చరించారు. పురూలియా వేదికగా ఆమె చేసిన ప్రసంగంలోని కీలక అంశాలు ఇక్కడ ఉన్నాయి:

**బెంగాలీ సంస్కృతిపై దాడి!**

"బెంగాలీలకు చేపలు, మాంసం, గుడ్లు అంటే కేవలం ఆహారం కాదు.. అది మన సంస్కృతి. కానీ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో వీటిపై ఆంక్షలు ఉన్నాయి. రేపు బెంగాల్‌లో ఆ పార్టీ గెలిస్తే, మీ ఇంట్లో ఏం వండాలో కూడా వాళ్లే నిర్ణయిస్తారు" అంటూ మమత ప్రజలను హెచ్చరించారు. బీజేపీకి ఏ మతంపై నమ్మకం లేదని, కేవలం అధికారం కోసం ప్రజల మధ్య చిచ్చు పెట్టడమే వారి నైజమని దుయ్యబట్టారు.

**అమిత్ షాకు స్ట్రాంగ్ కౌంటర్: "నా చావు కోరుకుంటున్నారా?"**

కేంద్ర హోం మంత్రి అమిత్ షా విడుదల చేసిన ఛార్జ్‌షీట్‌పై మమత అగ్నిపర్వతంలా విరుచుకుపడ్డారు. గతంలో తన కాలికి అయిన గాయంపై షా చేసిన వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా

మిగతా 2లో

## "మంత్రి అవినీతిపై విచారణా?

**ఇది దొంగే దొంగ అన్నట్టుంది!"**

**రేవంత్ సర్కార్‌పై మాజీ మంత్రి హరీశ్‌రావు నిప్పులు**

2




తెలంగాణ రాజకీయాల్లో మైనింగ్ అక్రమాల సెగలు కొనసాగుతూనే ఉన్నాయి. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కంపెనీ అక్రమాలకు పాల్పడిందని స్వయంగా ముఖ్యమంత్రి, మైనింగ్ మంత్రి అంగీకరించిన తర్వాత, దానిపై సీబీసీఐడీ విచారణ వేయడం హాస్యాస్పదమని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన ప్రభుత్వంపై ధ్వజమెత్తారు.

# తిరుమలలో 'యుద్ధ' సెగ

**ప్రైవేట్ హోటళ్లు విలవిల..**

**భక్తుల పాలిట అక్షయపాత్రగా 'అన్నప్రసాదం'!**



సుదూర ప్రాంతాల్లో జరుగుతున్న యుద్ధం.. కలియుగ వైకుంఠం తిరుమలపై అనూహ్య ప్రభావాన్ని చూపుతోంది. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా గ్యాస్ సరఫరాలో ఏర్పడిన అంతరాయం కొండపై ఉన్న ప్రైవేట్ హోటళ్లను దెబ్బతీయగా, శ్రీవారి భక్తులకు మాత్రం టీటీడీ అన్నప్రసాద కేంద్రాలు కొండంత అండగా నిలుస్తున్నాయి.

2

## అసెంబ్లీలో 'సస్పెన్షన్'
# ప్రకంపనలు

**కేటీఆర్, హరీశ్‌రావు సహా**

**24 మంది బీఆర్ఎస్ సభ్యులపై వేటు!**

**ఫిరాయింపులు – అక్రమాలపై సవాళ్లు.. ప్రతిసవాళ్లు**

*తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలు చివరి దశలో అత్యంత ఉత్కంఠకు దారితీశాయి. మైనింగ్ అక్రమాలపై హౌసింగ్ కమిటీ వేయాలన్న డిమాండ్‌తో సభలో ఆందోళనకు దిగిన ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ సభ్యులపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సస్పెన్షన్ వేటు వేశారు. బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు (రెండు రోజుల పాటు) ఈ సస్పెన్షన్ అమలులో ఉంటుంది.*

*శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు ప్రతిపాదించిన తీర్మానానికి సభ ఆమోదం తెలపడంతో.. కేటీఆర్, హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీశ్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, కౌశిక్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి సహా మొత్తం 24 మంది సభ్యులను సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. సభను పదేపదే అడ్డుకుంటున్నారన్న కారణంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.*

2



## నరసరావుపేటలో
# ఘోరం

**డాక్టర్ కుటుంబం ఆత్మహత్యాయత్నం..**

**తల్లి, మూడేళ్ల చిన్నారి మృతి**

2



మెదక్ టుడే
తెలుగు దినపత్రిక
సోమవారం 30-03-2026

## కన్నవారికి కవచం

పాటు ప్రజా ప్రతినిధులు (ఎమ్మెల్యేలు, ఎంపీలు తదితరులు) కూడా దీని పరిధిలోకి రావడం విశేషం.

**రేవంత్ రెడ్డి 'ఎమోషనల్' స్పీచ్: "రెక్కలొచ్చాక మరిచిపోతారా?"**
బిల్లును ప్రవేశపెట్టిన సమయంలో ముఖ్యమంత్రి చేసిన ప్రసంగం సభను ఆలోచింపజేసింది. "పిల్లల ఎదుగుదల కోసం ఆస్తులు అమ్మి, ఆయుష్షును ధారపోసిన తల్లిదండ్రులను.. రెక్కలొచ్చాక గాలికి వదిలేయడం అత్యంత హేయం. ఇలాంటి చట్టం తేవాల్సి రావడం సమాజం తలదించుకోవాల్సిన విషయం" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులను చూసుకోలేని వారు సామాజిక బహిష్కరణకు అర్హులని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు.

**కేంద్ర చట్టానికి 'తెలంగాణ' మెరుగులు**
2007లో కేంద్రం తెచ్చిన చట్టం కేవలం రూ. 10 వేల పరిమితికే లోబడి ఉంది. కానీ, తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగి వేతనంలో శాతాన్ని (15%) ప్రాతిపదికగా తీసుకోవడం ద్వారా, పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా వృద్ధులకు ఆర్థిక భరోసా కల్పించింది.

**శిక్ష కాదు.. బాధ్యత!**
ఈ బిల్లును ప్రభుత్వం ఒక 'శిక్షాత్మక చర్య'గా కాకుండా, 'బాధ్యతను గుర్తు చేసే ప్రక్రియ'గా అభివర్ణించింది. విదేశాల్లో లేదా ఇతర నగరాల్లో ఉంటూ తల్లిదండ్రులను పట్టించుకోని బిడ్డలకు ఇది ఒక గట్టి హెచ్చరిక. అధికారుల పర్యవేక్షణలో ఈ నిధుల మళ్లింపు ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరగనుంది.

"కన్నవారిని కంటికి రెప్పలా చూసుకోవడం చట్టబద్ధమైన విధి మాత్రమే కాదు.. అది ప్రతి మనిషి ప్రాథమిక సంస్కారం."
--- తెలంగాణ ప్రభుత్వం

## నరసరావుపేటలో ఘోరం

**నరసరావుపేట:** పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ విషాదంలో భార్య, మూడేళ్ల కుమార్తె ప్రాణాలు కోల్పోగా, కొన ఊపిరితో ఉన్న భర్త ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

**భోపాల్ ఎయిమ్స్ నుంచి వచ్చి లాడ్జీలో విషాదం**
నాదెండ్ల మండలం సాతులూరు గ్రామానికి చెందిన గోపి భోపాల్‌లోని ప్రతిష్టాత్మకమైన ఎయిమ్స్ ఆసుపత్రిలో వైద్యుడిగా పనిచేస్తున్నారు. ఆయన భార్య శంకరకుమారి (30) అక్కడే నర్సుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి మూడేళ్ల కుమార్తె మౌనిక ఉంది. శనివారం రాత్రి భోపాల్ నుంచి నరసరావుపేట చేరుకున్న ఈ కుటుంబం స్థానిక ఒక లాడ్జీలో బస చేశారు.

**తలుపులు బద్దలు కొట్టిన సిబ్బంది.. వెలుగులోకి దారుణం**
ఆదివారం ఉదయం ఎంతసేపటికీ గది నుంచి బయటకు రాకపోవడంతో అనుమానించిన లాడ్జీ సిబ్బంది తలుపులు బద్దలు కొట్టారు. లోపల శంకరకుమారి, చిన్నారి మౌనిక అప్పటికే విగతజీవులుగా పడి ఉండగా, గోపి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతుండడం చూసి నిర్ఘాంతపోయారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని గోపిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

**మత్తు ఇంజెక్షన్లతో ప్రాణాలు తీసుకున్నారా?**
వైద్య వృత్తిలో ఉన్న వారు కావడంతో, తాము వెంట తెచ్చుకున్న మత్తు ఇంజెక్షన్లను శరీరంలోకి ఎక్కించుకుని ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. భార్య, కుమార్తె మృతి చెందగా, గోపి పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉన్నట్లు సమాచారం.

**దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు:**
భోపాల్‌లో స్థిరపడిన ఈ విద్యావంతుల కుటుంబం ఇంతటి కఠిన నిర్ణయం తీసుకోవడానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కుటుంబ కలహాలా లేక ఆర్థిక ఇబ్బందులా అనే కోణంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చిన్నారి మౌనిక మృతి చెందడంతో సాతులూరు గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.సూచన: జీవితంలో సమస్యలు ఎదురైనప్పుడు ఆత్మహత్య పరిష్కారం కాదు. మీకు ఏదైనా మానసిక ఒత్తిడి ఉంటే సహాయం కోసం 14416 లేదా 104 హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదించండి.

## తమిళనాడు 'కురుక్షేత్రం'

**చెన్నై మార్చి 29:** తమిళనాడు రాజకీయాల్లో 'విజిల్' మోగింది. నటుడు విజయ్ తన రాజకీయ అరంగేట్రంలోనే అత్యంత సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నారు. కేవలం అభ్యర్థులను ప్రకటించడమే కాకుండా, అధికార డీఎంకే అగ్రనేతలను ఢీకొట్టేలా వ్యూహరచన చేశారు.

**దళపతి వ్యూహం: 'వన్ వర్సెస్ టూ'**
సాధారణంగా అగ్రనేతలు సురక్షిత స్థానాలను వెతుక్కుంటారు, కానీ విజయ్ మాత్రం ఒకేసారి రెండు స్థానాల నుంచి బరిలోకి దిగుతున్నారు
పెరంబూర్ (చెన్నై): డీఎంకే అభ్యర్థి ఆర్‌డీ శేఖర్‌తో పోరు.
తిరుచ్చి ఈస్ట్: ఇనిగో ఇరుదయరాజ్‌తో తలపడనున్నారు. ఈ రెండు స్థానాల ఎంపిక ద్వారా ఉత్తర మరియు మధ్య తమిళనాడు ఓటర్లను ఆకట్టుకోవాలన్నది విజయ్ ప్లాన్.

**'జైంట్ కిల్లర్స్' సిద్ధం: స్టాలిన్, ఉదయనిధిలకు చెక్!**
విజయ్ తన అభ్యర్థులను సామాన్యులుగా అభివర్ణించినా, వారిని బరిలోకి దింపిన స్థానాలు మాత్రం హాట్ టాపిక్‌గా మారాయి:
కొలత్తూర్: ముఖ్యమంత్రి స్టాలిన్ పై టీవీకే అభ్యర్థి వీఎస్ బాబు పోటీ.
చెపాక్: డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ పై మాజీ కాంగ్రెస్ నేత సెల్వం బరిలోకి.అధికార పక్షం ముఖ్య నేతలపై నేరుగా అభ్యర్థులను నిలబెట్టడం ద్వారా తాను కేవలం ఓట్లు చీల్చడానికి రాలేదని, గెలవడానికే వచ్చానని విజయ్ స్పష్టం చేశారు.

**'వికసిత్ తమిళనాడు' – మేనిఫెస్టో హైలైట్స్:**
యువత మరియు మహిళలే లక్ష్యంగా విజయ్ వరాల జల్లు కురిపించారు:
ఎడ్యుకేషన్ లోన్: పీహెచ్‌డీ వరకు చదువుకునే వారికి రూ. 20 లక్షల వరకు హామీ లేని రుణం.
నిరుద్యోగ భృతి: డిగ్రీ విద్యార్థులకు రూ. 4,000, డిప్లొమా చేసిన వారికి రూ. 2,000 నెలవారీ సాయం.
మహిళలకు కానుక: పెళ్లి చేసుకునే మహిళలకు 8 గ్రాముల బంగారం, పట్టుచీర మరియు నెలకు రూ. 2,500 గౌరవ వేతనం.

**"మాది ప్యాచ్-అప్ అలయన్స్ కాదు.. పీపుల్స్ అలయన్స్"**
డీఎంకే కూటమిని విమర్శిస్తూ విజయ్ చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. "ప్రజల కష్టాలు తెలిసిన వారే మా అభ్యర్థులు. మా ఎమ్మెల్యేలకు పాత్రికేయులను కొట్టిన చరిత్ర గానీ, అవినీతికి పాల్పడి జైలుకు వెళ్లిన చరిత్ర గానీ లేదు" అంటూ స్టాలిన్ సర్కార్‌పై తీవ్రమైన విమర్శలు గుప్పించారు

## అసెంబ్లీలో 'సస్పెన్షన్' ప్రకంపనలు

హైదరాబాద్: తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలు ముగింపు దశలో రణరంగంగా మారాయి. మైనింగ్ అక్రమాలపై సభా సంఘం వేయాలన్న డిమాండ్‌తో ప్రతిపక్షం పట్టుబట్టడం, అధికార-ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం చివరకు బీఆర్‌ఎస్ సభ్యుల భారీ సస్పెన్షన్‌కు దారితీసింది. పదేపదే సభకు అంతరాయం కలిగిస్తున్నారన్న కారణంతో కేటీఆర్, హరీశ్‌రావు సహా మొత్తం 24 మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు (రెండు రోజుల పాటు) సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు.

**సభలో అసలేం జరిగింది?** శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు సస్పెన్షన్ తీర్మానాన్ని ప్రతిపాదించగా, సభ దానికి ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో కేటీఆర్, హరీశ్‌రావు, తలసాని, జగదీశ్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి వంటి కీలక నేతలతో పాటు మొత్తం రెండు డజన్ల మంది సభ్యులపై వేటు పడింది. మైనింగ్ అంశంపై ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉన్నా, ప్రతిపక్షం కేవలం సభా సంఘం (ఎశీబంవ జశీఎఎఱ్‌వవ) కోసమే పట్టుబట్టి సభను అడ్డుకుంటోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు.

**కౌశిక్ రెడ్డిపై 'నైతిక' విచారణ** ఈ గందరగోళం మధ్యే హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రవర్తన తీవ్ర చర్చనీయాంశమైంది. సీనియర్ నేత కడియం శ్రీహరి పట్ల అసభ్యంగా సైగలు చేస్తూ, బెదిరించే ధోరణిలో వ్యవహరించడంపై సీఎం రేవంత్ రెడ్డి అగ్నిపర్వతంలా విరుచుకుపడ్డారు. కౌశిక్ రెడ్డి వ్యవహారాన్ని విచారించాలని నైతిక కమిటీకి (జ్ట్ర్రఱఎం జశీఎఎఱ్‌వవ) సిఫారసు చేశారు. "కడియం శ్రీహరి వంటి ప్రజా నాయకుడిని అవమానిస్తే సహించేది లేదు. ఇలాంటి ప్రవర్తనను ఇక్కడే అడ్డుకోకపోతే భవిష్యత్తులో సభలో కత్తిపోట్లు, కుస్తీలు జరుగుతాయి" అని సీఎం హెచ్చరించారు.

**'దళిత వ్యతిరేక' ముద్ర.. ఫిరాయింపుల రగడ** బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు దళిత వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. "దళితుడు ఆర్థిక మంత్రిగా ఉండకూడదన్నదే వీరి ఆలోచన. రాజ్యాలు ఏలడం వీరి హక్కు, గొర్రెలు కాయడం మా హక్కు అన్నట్టుగా వీరు ప్రవర్తిస్తున్నారు" అని విమర్శించారు. గతంలో టీడీపీ, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకుని మంత్రులను చేసిన బీఆర్‌ఎస్.. ఇప్పుడు ఫిరాయింపుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. మంత్రి పొంగులేటిపై అక్రమాల ఆరోపణలు ఉంటే ఆధారాలను సిబిసిఐడి కి ఇవ్వాలని సవాల్ విసిరారు.

**'డైవర్షన్ పాలిటిక్స్' అంటూ తలసాని కౌంటర్** ప్రభుత్వ చర్యను బీఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. పొంగులేటి అంశంపై తాము సభా సంఘం డిమాండ్ చేస్తే, దాన్ని పక్కదారి పట్టించేందుకే ముఖ్యమంత్రి కులాల ప్రస్తావన తెచ్చారని ఆరోపించారు. కడియం శ్రీహరి, దానం నాగేందర్ వంటి వారు ఏ పార్టీ తరపున సభలో మాట్లాడుతున్నారో చెప్పాలని అడగడం తప్పా అని ఆయన ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం కావాలనే 'డైవర్షన్ పాలిటిక్స్' చేస్తోందని విమర్శించారు.

# "మంత్రి అవినీతిపై పోలీసుల విచారణా?

**హైదరాబాద్:** తెలంగాణ రాజకీయాల్లో మైనింగ్ అక్రమాల సెగలు కొనసాగుతూనే ఉన్నాయి. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కంపెనీ అక్రమాలకు పాల్పడిందని స్వయంగా ముఖ్యమంత్రి, మైనింగ్ మంత్రి అంగీకరించిన తర్వాత, దానిపై సీబీసీఐడీ విచారణ వేయడం హాస్యాస్పదమని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన ప్రభుత్వంపై ధ్వజమెత్తారు.

**సీబీసీఐడీ ఎంక్వయిరీ ఒక ప్రహసనం!**
"మంత్రి పదవిలో ఉన్న వ్యక్తిపై ప్రభుత్వ పరిధిలోని పోలీసులు విచారణ ఎలా చేస్తారు? ఇది కేవలం పొంగులేటిని కాపాడటానికే సీఎం వేసిన ఎత్తుగడ" అని హరీశ్‌రావు విమర్శించారు. ఒకవేళ ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే మంత్రిని వెంటనే బర్తరఫ్ చేయాలని, లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, లేదంటే హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు.

**పొంగులేటి కంపెనీ అక్రమాలు – ఆధారాలు ఇవే!**
పొంగులేటి కంపెనీకి సంబంధించి కీలక ఆధారాలను హరీశ్‌రావు బయటపెట్టారు:
అనుమతులు లేవు: మైనింగ్ లైసెన్స్, పర్యావరణ అనుమతులు లేకుండానే అక్రమంగా జనరేటర్ల సహాయంతో మైనింగ్ నిర్వహిస్తున్నారు.మొదటి తనిఖీలో 28.50 లక్షలు, రెండోసారి తనిఖీలో ?కోటికి పైగా పెనాల్టీ పడిందని, నిబంధనల ప్రకారం రెండోసారి తప్పు చేస్తే ఏడాది జైలు శిక్ష పడాలని గుర్తుచేశారు. గత రెండున్నరేళ్లుగా రోజుకు కోటి రూపాయల చొప్పున ప్రభుత్వ ఖజానాకు వందల కోట్ల నష్టం వాటిల్లిందని ఆరోపించారు.

**కౌశిక్ రెడ్డిపై వేటు – గొంతు నొక్కే ప్రయత్నం**
ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేయడంపై హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. "ప్రశ్నించే గొంతుకలను నొక్కేయడమే రేవంత్ రెడ్డి లక్ష్యం. అసెంబ్లీలో అనాగరిక భాష వాడిన రేవంత్ రెడ్డిని మొదట ఎథిక్స్ కమిటీకి పంపాలి, ఆయనపైనే అనర్హత వేటు వేయాలి" అని డిమాండ్ చేశారు.

**రేవంత్ రెడ్డికి 20 స్కామ్‌ల సవాల్!**
ముఖ్యమంత్రికి పారదర్శకత ఉంటే ఈ కింది 20 అంశాలపై విచారణకు సిద్ధమా అని హరీశ్‌రావు సవాల్ విసిరారు:
అమృత్ టెండర్లు, కేఎల్‌ఎస్‌ఆర్ అక్రమాలు.
సివిల్ సప్లైస్, సింగరేణి ఓబీ టెండర్లు.
నైని కోల్ బ్లాక్, మంచిరేవుల దేవాదాయ భూముల కుంభకోణం.
ఫోర్త్ సిటీ, యంగ్ ఇండియా స్కూల్స్ మరియు మూసీ ప్రాజెక్ట్ టెండర్లు.

**దళిత కార్డుపై ధ్వజం: "మీది కపట ప్రేమ.. మాది కృతజ్ఞత"**
ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి దళిత కార్డు వాడుతోందని హరీశ్‌రావు విమర్శించారు. బీఆర్‌ఎస్ హయాంలో ఎస్సీ సంక్షేమానికి ?7,361 కోట్లు ఖర్చు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి ఏడాది కేవలం ?1,395 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని గణాంకాలతో వివరించారు. దళిత బంధుకు నిధులు సున్నా అని, ఎస్సీ డిక్లరేషన్ అమలు చేయకుండా దళితులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు.

**హరీశ్‌రావు విసిరిన సవాళ్లు:**
సిట్టింగ్ జడ్జితో విచారణ: తనపై, తన కుటుంబ సభ్యులపై వచ్చిన ఆరోపణలతో పాటు సీఎం తమ్ముళ్లు, బావమరిదిపై వచ్చిన ఆరోపణలన్నింటిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణకు తాను సిద్ధమని ప్రకటించారు.
క్షమాపణ డిమాండ్: తప్పుడు ఆరోపణలు చేసినందుకు రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని, తోకముడిచి పారిపోవద్దని హెచ్చరించారు.
**50-50 వాటాలు:** ల్యాండ్ సెటిల్‌మెంట్లలో సీఎంకు, పొంగులేటికి మధ్య 50-50 కమీషన్ వాటాలు ఉన్నాయని, అందుకే ఒకరినొకరు కాపాడుకుంటున్నారని ఆరోపించారు. "పొంగులేటి, రేవంత్‌ది ఫెవికాల్ బంధం" అని అభివర్ణించిన హరీశ్‌రావు, త్వరలోనే మరిన్ని భూ కుంభకోణాలను ఆధారాలతో సహా బయటపెడతామని హెచ్చరించారు.

# "కేరళలో 'దోపిడీ కూటమి'కి కాలం చెల్లింది..

**పాలక్కాడ్:** కేరళ రాష్ట్రం దశాబ్దాలుగా స్వార్థ రాజకీయాల మధ్య నలిగిపోతోందని, కాంగ్రెస్,కమ్యూనిస్టులు కలిసి ప్రజల సంపదను కొల్లగొట్టారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పాలక్కాడ్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, రాష్ట్రంలో మార్పు స్పష్టంగా కనిపిస్తోందని, ఈసారి ఎన్‌డీఏ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.'కేరళలో కాంగ్రెస్, కమ్యూనిస్టులు ఒకరిపై ఒకరు 'బీ-టీమ్' అని విమర్శలు చేసుకుంటారు. కానీ ఢిల్లీకి వెళ్తే మాత్రం ఇద్దరూ ఒకటే" అని మోదీ ఎద్దేవా చేశారు. దశాబ్దాలుగా కుంభకోణాల మధ్య వీరు అధికారాన్ని పంచుకుంటున్నారని, ఒకరి అవినీతిపై మరొకరు ఎన్నడూ చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. రాష్ట్రంలో వీరిద్దరికీ అసలైన పోటీదారు బీజేపీయేనని వారు ఇప్పుడిప్పుడే అంగీకరిస్తున్నారని వ్యాఖ్యానించారు.

**అప్పుల ఊబిలో కేరళ: ఉద్యోగులకు జీతాల్లేని దుస్థితి**
రాష్ట్ర ఆర్థిక సంక్షోభంపై ప్రధాని ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం కేరళపై రూ. 5 లక్షల కోట్లకు పైగా అప్పు మోపిందని, రెండేళ్లలోనే ఇది మూడు రెట్లు పెరిగిందని గుర్తుచేశారు. "చివరకు ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు, డీఏ (ణూ) బకాయిలు కూడా చెల్లించలేని దౌర్భాగ్య స్థితికి రాష్ట్రాన్ని చేర్చారు. ప్రజల కష్టార్జితం ఎక్కడికి పోతోంది? సమాధానం ఒక్కటే.. అది పినరయి విజయన్ ప్రభుత్వ జేబుల్లోకి వెళ్తోంది" అని విమర్శించారు.

**మోదీ గ్యారెంటీ: అవినీతి సొమ్ము రికవరీ!**
"బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే, అవినీతిపరులు దోచుకున్న ప్రజా ధనాన్ని చట్టబద్ధంగా తిరిగి వసూలు చేస్తాం. ఆ నిధులను కేరళ అభివృద్ధికి, పేదల సంక్షేమానికి ఖర్చు చేస్తాం" అని మోదీ హామీ ఇచ్చారు. గత పదేళ్లలో రాష్ట్రంలో ఒక్క కొత్త పారిశ్రామిక ప్రాజెక్టు కూడా రాకపోవడాన్ని ఆయన ఎత్తిచూపారు.

**కాంగ్రెస్, లెఫ్ట్ పాలన – వినాశకరమైన మోడల్** బెంగాల్, త్రిపురలను కమ్యూనిస్టులు ఎలా నాశనం చేశారో దేశమంతా చూసిందని, ఇప్పుడు కేరళను కూడా అదే పథకంతో నాశనం చేస్తున్నారని మోదీ మండిపడ్డారు. పొరుగున ఉన్న కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్‌లలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అభివృద్ధి నిలిచిపోయిందని, ఆర్థిక సంక్షోభం నెలకొందని.. అదే 'కాంగ్రెస్ పాలన మోడల్' అని విమర్శించారు.

**భారతీయుల భద్రతే పరమావధి** పశ్చిమాసియా యుద్ధ ప్రభావం భారత్‌పై పడకుండా కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ప్రధాని తెలిపారు. యుద్ధ ప్రాంతాల్లో ఉన్న లక్షలాది మంది కేరళీయుల భద్రత కోసం ప్రపంచ దేశాధినేతలతో సంప్రదింపులు జరుపుతున్నామని, భారతీయుల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు.

"కేరళ యువత, మహిళలు, రైతులు మార్పును కోరుకుంటున్నారు. 'వికసిత్ కేరళ' నిర్మాణమే మోదీ లక్ష్యం. బీజేపీ గెలుపుతో కేరళ దశ మారుతుంది." --- నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి

## తిరుమలలో 'యుద్ధ' సెగ

**తిరుమల మార్చి 29:** సుదూర ప్రాంతాల్లో జరుగుతున్న యుద్ధం.. కలియుగ వైకుంఠం తిరుమలపై అనూహ్య ప్రభావాన్ని చూపుతోంది. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా గ్యాస్ సరఫరాలో ఏర్పడిన అంతరాయం కొండపై ఉన్న ప్రైవేట్ హోటళ్లను దెబ్బతీయగా, శ్రీవారి భక్తులకు మాత్రం టీటీడీ అన్నప్రసాద కేంద్రాలు కొండంత అండగా నిలుస్తున్నాయి.

**గ్యాస్ సెగ: మూతపడుతున్న ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు**
యుద్ధం కారణంగా కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా 50 శాతానికి పడిపోయింది. రోజూ 500 సిలిండర్లు వచ్చే చోట ఇప్పుడు కేవలం 200 మాత్రమే అందుబాటులో ఉంటున్నాయి. తిరుమలలోని 150 ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో ఇప్పటికే 40కి పైగా మూతపడ్డాయి. తెరిచి ఉన్న హోటళ్లలో కూడా గ్యాస్ ఆదా చేసేందుకు కేవలం అల్పాహారానికే పరిమితం అవుతున్నారు. ఎక్కువ గ్యాస్ అవసరమయ్యే పదార్థాలను మెనూ నుంచి తొలగించారు.

**అన్నప్రసాద కేంద్రాలకు పోటెత్తిన భక్తులు**
ప్రైవేట్ హోటళ్లలో ఆహారం దొరక్కపోవడంతో భక్తులంతా టీటీడీ ఉచిత అన్నప్రసాద కేంద్రాల వైపు మళ్లుతున్నారు. దీంతో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో రద్దీ రికార్డు స్థాయికి చేరింది. గత ఏడాది (పది రోజుల్లో): 5.95 లక్షల మంది భోజనం చేశారు.ఈ ఏడాది (అదే సమయంలో): ఏకంగా 7.41 లక్షల మంది



భోజనం చేశారు.అంటే.. గత ఏడాదితో పోలిస్తే లక్షా 46 వేల మంది అదనంగా అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

**టీటీడీ అప్రమత్తం: అన్న వితరణకు 'ఢోకా' లేదు**
భక్తుల సంఖ్య అమాంతం పెరిగినా, టీటీడీ అధికారులు ముందస్తుగా అప్రమత్తమయ్యారు. గ్యాస్ నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వకుళమాత, శ్రీ అక్షయ కేంద్రాల్లో వంటా వార్పుకు ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టారు. టీటీడీ విజ్ఞప్తి మేరకు నిరంతరాయంగా గ్యాస్ సరఫరా చేసేందుకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సానుకూలంగా స్పందించింది.ఎంతమంది భక్తులు వచ్చినా అన్నప్రసాద వితరణలో ఎటువంటి లోటు రానీయబోమని అధికారులు స్పష్టం చేశారు.

**భక్తులకు ఊరట:** హోటళ్లు మూతపడినా, ధరలు పెంచినా సామాన్య భక్తుడు ఆకలితో అలమటించకుండా టీటీడీ తీసుకున్న ఈ చర్యలు సర్వత్రా ప్రశంసలు అందుకుంటున్నాయి. శ్రీవారి సన్నిధిలో అన్నప్రసాదమే భక్తుల పాలిట నిజమైన సంజీవనిగా మారింది.

## 'బెంగాల్ కంచంపై బీజేపీ కన్నేసింది.

పరిగణించారు. "నేను ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డాను. నా బ్యాండేజీపై జోకులు వేస్తారా? అసలు నన్ను వీల్‌చైర్‌కే పరిమితం చేయాలని చూసింది ఎవరు? నా ప్రాణాలు తీయాలని కుట్ర పన్నుతున్నారా?" అంటూ నేరుగా కేంద్ర మంత్రిని ప్రశ్నించారు.

**ఓట్ల గల్లంతు: 1.2 కోట్ల మంది పేర్ల తొలగింపుపై ధ్వజం**
ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితా సవరణ పేరుతో బీజేపీ కుట్రలకు తెరలేపిందని మమత ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.2 కోట్ల మంది పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించారని, ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని మండిపడ్డారు. ముఖ్యంగా గిరిజనులు, మహిళలు మరియు బెంగాలీలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారని విమర్శించారు.

**"లక్ష్మీర్ భండార్" పథకానికి ముప్పు!**
బెంగాల్ మహిళల ఆర్థిక భరోసా అయిన 'లక్ష్మీర్ భండార్' పథకాన్ని బీజేపీ రద్దు చేసేందుకు సిద్ధమవుతోందని ఆమె తెలిపారు. "మా ప్రభుత్వం పేదల పక్షాన ఉంటే, బీజేపీ కేవలం కార్పొరేట్ల పక్షాన ఉంటుంది. మహిళలకు ఇచ్చే ఈ చిరుకానుకను కూడా వారు సహించలేకపోతున్నారు" అని పేర్కొన్నారు.

"అల్లర్లు సృష్టించి అధికారంలోకి రావాలని చూస్తున్న బీజేపీకి బెంగాల్ గడ్డపై చోటు లేదు. బెంగాల్ సంస్కృతిని కాపాడుకునే బాధ్యత మనందరిది!"
--- మమతా బెనర్జీ

# రామేశ్వరంబండ సమగ్ర అభివృద్ధికి సంపూర్ణ సహకారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి.

## రామేశ్వరంబండ జిహెచ్ఎంసి ఇంద్రపురి కాలనీలో సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

**పటాన్ చెరు మార్చి: 29(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి** ఇంద్రేశం మున్సిపల్ పరిధిలోని రామేశ్వరంబండ సమగ్ర అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం సాయంత్రం రామేశ్వరంబండ పరిధిలోని ఇంద్రపురి కాలనీలో పది లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో రామేశ్వరంబండ పరిధిలోని నాలుగు వార్డుల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు భారీ విజయాన్ని అందించడం పట్ల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ప్రతి హామీ నెరవేర్చేందుకు ప్రణాళిక బద్ధంగా నిధులు కేటాయించడంతోపాటు నిర్దేశించిన లక్ష్యంలోగా పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

రాబోయే రోజుల్లోనూ మరిన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టబోతున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పూర్తి పారదర్శకతతో ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ప్రమీల, మున్సిపల్ కమిషనర్ అజయ్ రెడ్డి, వైస్ చైర్మన్ హరీష్ రెడ్డి, కౌన్సిలర్లు అంతిరెడ్డి, రమేష్, వంకదోత్ రమేష్, మాజీ ప్రజా ప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.





# లక్ష్మీ సాయి మెడోస్ కాలనీ అభివృద్ధికి శశిధర్ రెడ్డి ముందడుగు

## సొంత నిధులతో సీసీ రోడ్డు ప్యాచ్ వర్క్ పనులు పూర్తి

## ప్రజల సమస్యల పరిష్కారమే నా ధ్యేయం: అమీన్‌పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు

**అమీన్‌పూర్, మార్చి 29:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి** అమీన్‌పూర్ జిహెచ్ఎంసి పరిధిలోని బీరంగూడ డివిజన్ 270లో గల లక్ష్మీ సాయి మెడోస్ కాలనీ అభివృద్ధి దిశగా మరో ముందడుగు పడింది. గత రెండు సంవత్సరాలుగా కాలనీలోని ప్రధాన సీసీ రోడ్డు తీవ్రంగా దెబ్బతినడంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన అమీన్‌పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు జి. శశిధర్ రెడ్డి, తన ఉదారతను చాటుకున్నారు.ప్రభుత్వ నిధుల కోసం వేచి చూడకుండా, ప్రజా సంక్షేమమే పరమావధిగా ఆయన తన సొంత నిధులతో సుమారు 35 క్యూబిక్ మీటర్ల కాంక్రీటుతో రోడ్డు ప్యాచ్ వర్క్ పనులను చేయించి పూర్తి చేశారు. దీనివల్ల వర్షాకాలంలో బురద, వేసవిలో దుమ్ము సమస్యల నుండి కాలనీ వాసులకు శాశ్వత ఉపశమనం లభించింది.

**ఘనంగా సన్మానం:**సకాలంలో స్పందించి రోడ్డు సమస్యను పరిష్కరించినందుకు గాను, కాలనీ ప్రెసిడెంట్ మల్లేష్, కాలనీ కమిటీ సభ్యులు మరియు కాలనీ వాసులు కలిసి శశిధర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా శశిధర్ రెడ్డి మాట్లాడుతూ"ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా గుర్తించి పరిష్కరించడమే నా బాధ్యత. గత రెండేళ్లుగా కాలనీ వాసులు రోడ్డు సమస్యతో పడుతున్న ఇబ్బందులు నా దృష్టికి రావడంతో వెంటనే స్పందించాను. ప్రజల విశ్వాసమే నాకు మరింత బాధ్యతను కల్పిస్తుంది. భవిష్యత్తులో కూడా అమీన్‌పూర్ పరిధిలోని ప్రతి కాలనీ అభివృద్ధికి నా వంతు కృషిని నిరంతరం కొనసాగిస్తాను."ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ మల్లేష్, కాలనీ కమిటీ సభ్యులు మరియు కాలనీ వాసులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు మరియు పెద్ద సంఖ్యలో కాలనీ వాసులు పాల్గొన్నారు.



# మానవ హక్కులపై అవగాహన కార్యక్రమం విజయవంతం

## – నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహణ –

**(స్పెషల్ కరస్పాండెంట్)మదనపల్లి,మార్చి,29, మెదక్ టుడే న్యూస్:** మానవ హక్కులు మరియు సామాజిక న్యాయం పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు నిర్వహించిన అవగాహన సదస్సు మదనపల్లిలో ఘనంగా జరిగింది. నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ మదనపల్లి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రజల నుంచి విశేష స్పందన పొందింది.ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ వైస్ చైర్‌పర్సన్ శ్రీమతి కే. వాణి సమర్థవంతంగా నిర్వహించారు. ఆమె నాయకత్వంలో జరిగిన ఈ సదస్సు మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం సాధనలో కీలక సందేశాలను సమాజానికి చేరవేసింది.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జనసేన పార్టీ నాయకులు, మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్ రెడ్డి, రామచంద్ర



పాల్గొని మానవ హక్కుల ప్రాధాన్యాన్ని వివరించారు. ప్రతి వ్యక్తికి సమాన హక్కులు కల్పించాల్సిన బాధ్యత సమాజంపై ఉందని, అణగారిన వర్గాల హక్కుల కోసం అందరూ కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ ఆలిండియా ఇన్‌చార్జి మరియు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బి. సర్వేందర్ మాట్లాడుతూ,"మానవ హక్కులు ప్రతి పౌరునికి సహజసిద్ధమైనవి. వాటి పరిరక్షణ కోసం ప్రజల్లో చైతన్యం కల్పించడం సంస్థ లక్ష్యం. సమాజంలో అన్యాయం, అసమానతలను తొలగించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి" అని పేర్కొన్నారు.జాతీయ నాయకులు కోట్ల రాజ్ కుమార్, కోట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో మానవ హక్కులపై అవగాహన ఇంకా పెరగాల్సిన అవసరం ఉందని, సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని చెప్పారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పోలిశెట్టి రామప్ప తన ప్రసంగంలో,"సామాజిక న్యాయం సాధనలో యువత కీలక పాత్ర పోషించాలి. హక్కులపై అవగాహన పెంపొందితేనే సమానత్వ సమాజం నిర్మాణం సాధ్యం" అని అన్నారు.తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.ఎల్. రవీందర్ నాయుడు,శ్రీమతి ఉషా నాయుడు.. మాట్లాడుతూ, మహిళల సాధికారత లేకుండా సమాజ అభివృద్ధి అసాధ్యమని, మహిళలు ముందుకు వచ్చి నాయకత్వ బాధ్యతలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బుజ్జి బాబు, జాన్, నన్నపనేని సురేష్, రవి, లహరి, కిరీటి, రూపేష్, శెట్టి రాజేష్, హైదరాబాద్ నుండి శ్రీమతి లతా రెడ్డి తదితరులు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. వారు మానవ హక్కులు, సామాజిక న్యాయం అంశాలపై విభిన్న కోణాల్లో మాట్లాడి కార్యక్రమాన్ని మరింత ప్రాముఖ్యంగా నిలిపారు.కార్యక్రమం సందర్భంగా మహిళలకు చీరలు పంపిణీ చేయడం జరిగింది. అదేవిధంగా కార్యక్రమానికి ఆకర్షితులై 10 మంది నూతన సభ్యులు సంస్థలో చేరగా, వారికి ఐడీ కార్డులు, నియామక పత్రాలు అందజేశారు.శ్రీమతి కే. వాణి సేవలను అతిథులు ప్రత్యేకంగా ప్రశంసించారు. మానవ హక్కులు, సామాజిక న్యాయం కోసం నిరంతరం కృషి చేస్తూ సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషిస్తున్న ఆమెను ఆదర్శంగా తీసుకుని మరిన్ని మహిళలు ముందుకు రావాలని వక్తలు పిలుపునిచ్చారు.మదనపల్లి రింగ్ రోడ్ బైపాస్ సమీపంలో అట్టహాసంగా నిర్వహించిన ఈ కార్యక్రమం మానవ హక్కులపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంలో కీలకంగా నిలిచింది. సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో మరింత విస్తరించాలని పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు

# సస్పెన్షన్‌పై సంగమేశ్వర్ ఘాటు విమర్శలు

## కాంగ్రెస్‌కు రాజీనామా, బిఆర్ఎస్ వైపు అడుగులు

**పటాన్‌చెరు, మార్చి : 29(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి** పటాన్‌చెరు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా పనిచేసిన దేవళ్ల సంగమేశ్వర్‌ను సస్పెండ్ చేయడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీకి గుడ్‌బై చెప్పారు. గత పది సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని, కాటా శ్రీనివాస్ గౌడ్ నాయకత్వంలో అహర్నిశలు పార్టీ బలోపేతానికి కృషి చేసిన తనను ఎలాంటి విచారణ లేకుండా సస్పెండ్ చేయడం తీవ్ర వేదనకు గురిచేసిందని తెలిపారు.పార్టీకి వ్యతిరేకంగా తాను చేసిన చర్యలు ఏంటో స్పష్టంగా తెలియజేయకుండా, కనీసం వివరణకు అవకాశం ఇవ్వకుండా అధ్యక్ష పదవి నుండి తొలగించడం పూర్తిగా అన్యాయమని ఘాటుగా విమర్శించారు. పార్టీకి నిస్వార్థంగా సేవలు అందించిన తనను ఇలా పక్కన పెట్టడం తీవ్ర మనస్తాపానికి గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ యూత్ కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన సంగమేశ్వర్, ఇకపై కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పార్టీ వ్యవహార శైలి పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఇదే తన తుది నిర్ణయమని తెలిపారు.ఇక రాజకీయంగా కీలక మలుపు తీసుకుంటూ, త్వరలోనే కేటీఆర్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు వెల్లడించారు. తనతో పాటు పార్టీకి అంకితభావంతో పనిచేసిన కొంతమంది కార్యకర్తలు కూడా కాంగ్రెస్‌ను వీడి తన వెంటనే రావడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.ఇతని రాజీనామాతో ముత్తంగి జిహెచ్ఎంసి 265 డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇప్పటికే ఆ ప్రాంతంలో పార్టీ బలహీనతలు బయటపడుతున్న వేళ, కీలక యువనేత రాజీనామా చేయడం కాంగ్రెస్‌కు మరింత ఇబ్బందికర పరిస్థితులను తీసుకురానుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఈ నేపథ్యంలో, ఆయనకు సన్నిహితంగా ఉన్న నేతలుగా ఎలగరి లావణ్య, శంకర్ ముదిరాజ్ పేర్లతో పాటు మరికొంతమంది యువ కార్యకర్తల పేర్లు కూడా వినిపించడం గమనార్హం.



# ఐఓసి ప్రార్థన మందిరంలో ఘనంగా మట్టల ఆదివారం

**చేగుంట మార్చ్ 29 మెదక్ టుడే న్యూస్**మెదక్ జిల్లా చేగుంట మండల కేంద్రంలోని ఐఓసి ప్రార్థన మందిరంలో మట్టల



ఆదివారం వేడుకలు భయభక్తులతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో విశ్వాసులు తరలివచ్చి ప్రార్థనల్లో పాల్గొన్నారు.పాస్టర్ ప్రభుదాస్, సంఘ పెద్దల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐఓసి చర్చ్ పాస్టర్ ఎం. ప్రభుదాస్ విశ్వాసులను ఉద్దేశించి దేవుని వాక్యాన్ని బోధించారు. మత్తయి సువార్త 21:9 ఆధారంగా "దావీదు కుమారునికి జయము (హోసన్న), ప్రభువు పేరట వచ్చువాడు స్తుతించబడును గాక, సర్వోన్నతమైన స్థలంలో జయం" అనే సందేశాన్ని వివరించారు.ఈ సందర్భంగా విశ్వాసులు భయభక్తులతో ప్రార్థనలు చేస్తూ ఆధ్యాత్మిక ఆనందాన్ని అనుభవించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు సుధాకర్, లక్ష్మణ్, భక్త పాల్, డా. ప్రభుదాస్, నాగమోహన్, తిమ్మాయిపల్లి లచ్చన్న, నోవహు, ప్రశాంత్, చిన్నశివునూర్ బిక్షపతి, లైబ్రెరీ గణేష్, యువకులు జాన్,ప్రభు, మధు, ప్రేమ్. జోయల్ రాజ్ ,తదితరులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

మెదక్ టుడే
తెలుగు దినపత్రిక
సోమవారం 30-03-2026

# ఏడుపాయల వన దుర్గ భవాని మాతనుదర్శించుకున్న జిల్లా కలెక్టర్ దంపతులు.

**భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం వన దుర్గ భవాని మాత**

**ఆ దుర్గామాత ఆశీస్సులతో జిల్లాలో ప్రజలందరూ అష్టైశ్వర్యాలు ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలి.**

**కలెక్టర్ దంపతులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన ఆలయ కార్యనిర్వాహణాధికారి, అర్చకులు,**

**పాపన్నపేట,మార్చి,29, మెదక్ టుడే న్యూస్:** మంజీరా నది తీరాన వెలసిన అత్యంత మహిమాన్విత క్షేత్రం ఏడుపాయల వనదుర్గా భవానీ ఆలయం అని.భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం వన దుర్గ భవాని మాత అని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.ఏడుపాయల దుర్గామాతను మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.ఆలయ ఈవో వీరేశం, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారి పేర ప్రత్యేక పూజ నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్రంలో మెదక్ జిల్లాలో ఏడుపాయల దుర్గా భవానీ దేవత యొక్క అత్యంత గౌరవనీయమైన మందిరంగా పేర్కొన్నారు . కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా విరాజిల్లుతూ ఈ ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారని అన్నారు.మామూలు రోజుల్లో ఒక మాదిరిగా ఉండే భక్తుల రద్దీ ఆదివారాలలో అధిక సంఖ్యలో భక్తులు తాకిడికనుగుణంగా సకల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా భక్తులకు సౌకర్యాలు ఆలయ పరిసర ప్రాంతాలు పరిశుభ్రతంగా ఉంచడంలో నిర్వాహకుల సేవలను కలెక్టర్ కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఈవో వీరేశం సిబ్బంది శ్రీనివాస్, అర్చకులు పాల్గొన్నారు.



# సాయిబాబా కాలనీలో ఒడి బియ్యం కార్యక్రమం ఘనంగా

**– సీతారాముల కళ్యాణోత్సవం సందర్భంగా సామూహిక అన్నదానం –**



**(స్పెషల్ కరస్పాండెంట్) షాద్‌నగర్,మార్చి,29,మెదక్ టుడే న్యూస్:** షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని ఆరో వార్డులో గల సాయిబాబా కాలనీలో ఒడి బియ్యం కార్యక్రమం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం సందర్భంగా శివాలయం--ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరిగింది.అమ్మవారికి సమర్పించిన ఒడి బియ్యాన్ని కాలనీ మహిళలు సమిష్టిగా వంట చేసి కాలనీ వాసులకు భోజనాలను ఏర్పాటు చేయడం విశేషం. ఈ కార్యక్రమం ద్వారా భక్తి, సేవా భావం, ఐక్యత స్పష్టంగా ప్రతిఫలించిందని స్థానికులు తెలిపారు.ఈ కార్యక్రమం సాయిబాబా కాలనీ అధ్యక్షుడు మంగా శంకర్ (ఏఎస్ఎస్ జి) ఆధ్వర్యంలో జరిగింది. ప్రధాన కార్యదర్శి బొబ్బిలిగామ శ్రీనివాసులు, కోశాధికారి షాప్ శ్రీశైలం, సభ్యులు శివరాజు పవన్ (బోల్ట్), ర్యాకల అజయ్, మారుతి మధుసూదన్ గౌడ్ తదితరులు కార్యక్రమాన్ని సమన్వయం చేస్తూ పర్యవేక్షించారు.
కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని భోజనాన్ని స్వీకరించ డంతో కార్యక్రమం విజయవంతమైంది. ఈ సందర్భంగా పూజారి రమా మహేశ్వర్ మాట్లాడుతూ, ఇటువంటి ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందించడంతో పాటు పరస్పర సహకారాన్ని బలోపేతం చేస్తాయని తెలిపారు.

# కొత్తపేటలో ఎడ్ల బండ లాగుడు పోటీలు అట్టహాసంగా

**– శ్రీ రామ నవమి ఉత్సవాల్లో భాగంగా ఉత్సాహంగా నిర్వహణ**




**(స్పెషల్ కరస్పాండెంట్)కొత్తపేట,మార్చి,29,మెదక్ టుడే న్యూస్:** కొత్తపేట గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ హనుమాన్ రామలింగేశ్వర స్వామి వారి గుడి సన్నిధిలో జరుగుతున్న శ్రీ రామ నవమి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఎడ్ల బండ లాగుడు పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.గ్రామీణ సాంప్రదాయాన్ని ప్రతిబింబించే ఈ పోటీల్లో పరిసర ప్రాంతాల నుంచి రైతులు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎడ్ల బండల వేగం, సమన్వయం, నైపుణ్యం ప్రేక్షకులను ఆకట్టుకోగా, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై పోటీలను ఆస్వాదించారు.ఈ కార్యక్రమానికి కేశంపేట్ మండల మాజీ జడ్పిటిసి శ్రీమతి తాంద్ర విశాల శ్రవణ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ పట్లూరి హైమావతి జగదీశ్వర్ పాల్గొని పోటీల నిర్వహణను పర్యవేక్షించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇటువంటి సాంప్రదాయ క్రీడలు గ్రామీణ సంస్కృతిని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. యువత ఈ సంప్రదాయాలను కొనసాగించాలని, గ్రామీణ క్రీడలకు ప్రోత్సాహం ఇవ్వాలని పిలుపునిచ్చారు.పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమం మొత్తం ఉత్సాహభరిత వాతావరణంలో సాగి, శ్రీ రామ నవమి ఉత్సవాలకు ప్రత్యేక శోభను తీసుకువచ్చింది.

# క్రీడలు యువత ఉజ్వల భవిష్యత్తుకు మార్గం: కాట సునీత రాజు గౌడ్

**బీరంగూడలో వైభవంగా తెలంగాణ రాష్ట్ర స్థాయి కబడ్డీ ఛాంపియన్స్ ట్రోఫీ -- సీజన్ 10**

**ముఖ్య అతిథిగా విచ్చేసిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు.. క్రీడాకారులకు ప్రోత్సాహం**

**అమీన్ పూర్ మార్చి 29:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి** యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడం సమాజ అభివృద్ధికి ఎంతో కీలకమని, క్రీడలు శారీరక ధృడత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు శ్రీమతి కాట సునీత రాజు గౌడ్ అన్నారు. ఆదివారం బీరంగూడలోని మండే మార్కెట్ ప్రాంగణంలో అత్యంత ఉత్సాహంగా నిర్వహించిన 'తెలంగాణ రాష్ట్ర స్థాయి కబడ్డీ ఛాంపియన్స్ ట్రోఫీ -- సీజన్ 10' ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసారు.ఈ సందర్భంగా కాటా సునీత మాట్లాడుతూ.. కబడ్డీ వంటి మన మట్టి వాసన కలిగిన గ్రామీణ క్రీడలను ప్రోత్సహించడం ద్వారా ఆరోగ్యవంతమైన భవిష్యత్తును నిర్మించవచ్చని పేర్కొన్నారు. క్రీడాకారులు కేవలం గెలుపోటములకే పరిమితం కాకుండా, క్రమశిక్షణతో కష్టపడి ఆడి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఇంతటి భారీ స్థాయిలో క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహక కమిటీ సభ్యులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి మరిన్ని క్రీడా పోటీలు నిర్వహించి గ్రామీణ ప్రతిభను వెలికితీయాలని ఆమె సూచించారు.

**భారీగా తరలివచ్చిన క్రీడాభిమానులు:**

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పుష్ప నగేష్ , సీనియర్ నాయకులు నందరాం రమేష్ గౌడ్ పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన టీమ్ సభ్యులు తమ ప్రతిభను చాటుకోగా, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి క్రీడలను వీక్షించారు. క్రీడాకారుల కేరింతలు, స్థానికుల సందడితో బీరంగూడ మండే మార్కెట్ ప్రాంతం క్రీడా ప్రాంగణాన్ని తలపించింది.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, నిర్వాహక కమిటీ సభ్యులు మరియు క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







# జ్యోతిష్యం పండితుని నవీన్ కుమార్ శర్మ ని, సన్మానం చేసిన చేగుంట ఉప సర్పంచ్ మహమ్మద్ రఫీ

**చేగుంట మార్చి 29 మెదక్ టుడే న్యూస్** జ్యోతిష్యానికి ఆదరణ తగ్గలేదు శాస్త్ర, సాంకేతిక రంగాల పరంగా అభివృద్ధి చెంది నప్పటికీ జ్యోతిష్యానికి ఆదరణ తగ్గలేదని ఎన్ ఎస్ ఆస్ట్రొ సంస్థ నిర్వాహకులు నర్సింహా చారీ పేర్కొన్నారు. ఆదివారం పబ్లిక్ గార్డెన్ లోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ అడిటోరియంలో నాగోల్ బండ్లగూడ కు చెందిన శనిగల నవీన్ కుమార్ శర్మకు జ్యోతిష్య వాస్తు బ్రహ్మ పురస్కారాన్ని అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. జ్యోతిష్య శాస్త్రన్ని ప్రజలకు చేర వేయడంలో నవీన్ కుమార్ శర్మ కీలక పాత్ర పోషించారని తెలిపారు. అనేక సంవత్సరాలు గా గ్రహ పతులు, నక్షత్రాల ఆధారంగా ప్రజలకు మార్గదర్శకత్వం అందిస్తూ జ్యోతిష్యం పై అవగాహన పెంచుతున్నారని తెలిపారు. అవార్డు పొందిన నవీన్ కుమార్ శర్మ మాట్లాడుతూ జ్యోతిష్యం భారతీయ సంస్కృతి లో ముఖ్యమైన శాస్త్ర మని తెలిపారు. ఈ రంగంలో మరింత పరిశోదనలు జరగాలని యువత కూడా జ్యోతిష్యం పై ఆసక్తి చూపాలని సూచించారు. కార్యక్రమం లో పలువురు జ్యోతిష్య పండితులు ఆయన, చేగుంట స్నేహితులు లాలా గణేష్ దత్తు దాస్ పటేల్ గడ్డమీది రామస్వామి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య...

**పాపన్నపేట,మార్చి,29, మెదక్ టుడే న్యూస్:** మనస్థాపంతో ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని నార్సింగి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది.ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం...గ్రామానికి చెందిన ఫిరంగి సత్యనారాయణ (50) కల్లు వ్యాపారం చేస్తూ జీవితం సాగిస్తున్నాడు.కాగా వారం రోజుల క్రితం ఈయన పెద్ద కూతురు ఎంగేజ్ మెంట్ జరిగింది.దీంతో త్వరలో పెళ్లి ఉండడంతో పెళ్లికి డబ్బులు లేక అప్పు కోసం ప్రయత్నం చేస్తున్నాడు.అప్పు ఎక్కడ దొరకపోవడంతో మనస్థాపం చెందిన అతను శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు చుట్టూ పక్కల వెతకగా ఆదివారం ఉదయం సమయంలో గ్రామ రోడ్డు పక్కన పాడుబడిన రైస్ మిల్లులో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకొని కనిపించాడు.పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించి మృతుడి భార్య స్వర్ణలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail. medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO, TELTEL 2023 ,88524, 9948265095.9494117870..